హైలెవల్ వంతెనలు నిర్మించండి

- కాజ్‌వేలపై వరదతో రాకపోకలకు అంతరాయం
- పడిగాపూర్, ఎల్బాక గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు
- నార్లాపూర్‌లో నీట మునిగిన వరిపైరు



ఎల్బాకలోని లోలెవెల్ కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



నార్లాపూర్ దారిలో రోడ్డుకం డ్యామ్

ఎస్ఎస్‌తాడ్వాయి : వానాకాలం సీజన్‌లో లోలెవల్ వంతెన పైనుంచి వరద ప్రవహిస్తుడడంతో రవాణాకు అంతరాయం కలుగుతోంది. లోలెవల్ కాజ్‌వేపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎల్బాక లోలెవల్ కాజ్‌వే, ఊరట్టం, నార్లాపూర్ రోడ్డుకం డ్యామ్‌లపై హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏటా వరదలకు లోలెవల్ కాజ్‌వే, రోడ్డుకం డ్యామ్‌లపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయంతోపాటు వరి పైరు నీట మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాజాతర సమయంలో కోట్లాది నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం లోలెవల్ వంతెనలపై హైలెవల్ వంతెనల నిర్మాణంపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్బాక కాజ్‌వేపై హైలెవల్ వంతెన నిర్మాణానికి గతంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని ప్రచారం జరిగింది తప్ప హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నేటివరకు కార్యరూపం దాల్చలేదనే ఆరోపణలు ఉన్నాయి.

20 రోజులుగా నిలిచిన రవాణా

ప్రతి ఏటా వానాకాలంలో ఎల్బాక కాజ్‌వేపై నుంచి జంపన్నవాగు వరద ప్రహహించడంతో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నార్లాపూర్ క్రాస్ నుంచి ఎల్బాక వెళ్లే దారిలోని లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరద పోతుడడంతో 20రోజుల నుంచి పస్రా–నార్లాపూర్ మధ్య రవాణా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాజ్‌వే పైనుంచి వరద ప్రవహించడంతో అటువైపు వెళ్లకుండా పోలీసులు భారీకేడ్లను ఏర్పాటు చేసి కాపాలా ఉంచారు. దీంతో ఎల్బాక, పడిగాపూర్ గ్రామస్తులు పనుల నిమిత్తం ఎల్బాక నుంచి మేడారం రోడ్డు మార్గాన తాడ్వాయి, పస్రాకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలినడకన, ద్విచక్రవాహనాలపై మేడారానికి వస్తే ఆటోలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది. కాజ్‌వే పై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నార్లాపూర్ డ్యామ్‌తోమునుగుతున్న పంటలు

నార్లాపూర్ చెక్ పోస్టు సమీపంలో రోడ్డుకం డ్యామ్‌పై జంపన్నవాగు వరద ప్రవహిస్తుడడంతో పంట పొలాలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రోడ్డుకం డ్యామ్ కింద పైపులు తక్కువ సైజులో ఉండడంతో వరద ఉధృతి బయటకు వెళ్లక పోవడంతోపాటు నీరు పంటపొలాలను ముంచెత్తుతుంది. అంతేకాకుండా రోడ్డుకం డ్యామ్ కింద నుంచి వరద కాల్వల ద్వారా జంపన్నవాగులోకి వెళ్లాల్సి ఉంది. కొంతమంది ఇటుక బట్టీల కారణంగా కాల్వలను పూడ్చివేయడంతో వరద ముందుకు వెళ్లకపోవడంతో వరి పంట నీట మునిగిందని రైతులు వాపోతున్నారు. సుమారుగా ఇప్పటి వరకు 50 ఎకరాల వరి పంటలు నీటమునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి పంట నీటమునిగింది



రోడ్డుకం డ్యామ్ వరద వల్ల రెండెకరాల వరి పంట నీటమునిగింది. వరద కాల్వల ద్వారా సాఫీగా నీరు వెళ్లక పోవడంతో పంట పొలాలపై వరద కొట్టుకు వచ్చి ముంచెత్తుతోంది. వారం రోజులనుంచి వరిపంట వరద నీటిలో మునిగి ఉంది.

– సమ్మయ్య, రైతు, నార్లాపూర్

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



నార్లాపూర్ దారిలోని రోడ్డుకం డ్యామ్‌పై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. వర్షాలు కురవడంతో వరద రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో నార్లాపూర్ నుంచి మేడారానికి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అంతేకాకుండా రైతుల వరి పొలాలు నీట మునిగిపోయి నష్టం వాటిల్లుతుంది. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– ఎనగంటి నరేష్, నార్లాపూర్

ఉపాధ్యాయులకు సన్మానం



రాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కన్నాయిగూడెం : మండలంలోని చింతగూడెంలో విధులు నిర్వర్తించి ప్రమోషన్‌పై వెళ్తున్న ఉపాధ్యాయుడు రౌత్ రాజును, అదే పాఠశాలకు పీజీ హెచ్ఎంగా వచ్చిన శ్రీనివాస్ రెడ్డికి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు ప్రజ్ఞ, రాజేశ్వరి, సారంగపాణి, లావణ్య, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



బురదలో నుంచి వెళ్తున్న వాహనదారులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని జిల్లాకాలనీ సమీపంలో పాలెం కాల్వ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా పనులు పూర్తికాక పోవడంతో వాహనాలు వెళ్లడానికి డైవర్షన్ ఏర్పాటు చేశబూరు, దీంతో వర్షం పడగానే రహదారి మొత్తం బురదమయంగా మారి, వాహనదారులకు ప్రయాణం ప్రాణ సంకటంగా ఉంది. ఆ దారి గుండా వెళ్తున్న వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కార్లు, బైక్‌లు, ఇతర వాహనదారులు బురదలో నుంచి బయటకు వచ్చే లోగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. నేడు జిల్లా కేంద్రంలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఫీడర్–1 పరిధిలో జాతీయ రహదారి వెంట స్తూపం, లక్ష్మీనగర్, జయరాం గోదాం, టైర్ల కొట్టు, మంజునాథపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేయ బడుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ములుగు: బెంగుళూరులో గతనెల 30, 31 తేదీలలో జరిగిన 4వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్–2025 పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు జిల్లా క్రీడాధికారి సర్దార్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పతకాల వివరాలను వెల్లడించారు. 55 కేజీల కేటగిరిలో కుంట వర్షిత్ బంగారు పతకం, సబ్‌జూనియర్ విభాగంలో ఉరుకొండ అఖిలేష్ కుమార్ వెండి పతకం, 68 కేజీల విభాగంలో బడవత్ దినేష్ కాంస్య పతకం గెలిచి జిల్లాకు కీర్తి తీసుకువచ్చారని వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించినట్లు తెలిపారు.

గ్రామ కమిటీల ఎన్నిక

ములుగు రూరల్ : ములుగు మండలంలోని కన్నాయిగూడెం, పంచోత్కులపల్లి, పెగడపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీల ఎన్నికను బుధవారం మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని నిర్వహించారు. కన్నాయిగూడెం అధ్యక్షురాలిగా దుగ్గి కుష్బూ, పంచోత్కులపల్లి అధ్యక్షురాలిగా ఆగబోయిన విజయ, పెగడపల్లి అధ్యక్షురాలిగా తాటి కవితను నియమించడంతో పాటు పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను, వడ్డీలేని రుణాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో మహిళా అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు పిట్టల రాధిక, అల్లూరి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ



కన్నాయిగూడెం : మండలంలోని తుపాకుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టల గంగారంలో బుధవారం వైద్యసిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడుతారని ముందస్తుగా గ్రామాల్లో రెండో దఫా దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు డాక్టర్ అభినవ్ తెలిపారు. భాస్కర్‌రావు, ఆశలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



చిట్యాల : మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని స్టార్‌యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం వినాయక మండపంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్‌తో పాటు కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. దీంతో మతసామరస్యం సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలోని అంగన్‌వాడీ–2 భవన నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల రూ.12లక్షలు మంజూరు చేశారు. బుధవారం పలుగుల యూపీఎస్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ రవీందర్, పంచాయతీ సెక్రటరీ సమ్మయ్య, హెచ్ఎం మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ ఒద్ది ఉమామహేశ్వరి, మాజీ సర్పంచ్ ఒద్ది చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ మానెం మహేష్, మచ్చ వెంకటేష్, సుగుణ, రాజయ్య, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిగా మార్చాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెంకటేష్

ఏటూరునాగారం : ఏరియా ఆస్పత్రిగా మార్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని, వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. బుధవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో సామాజిక వైద్యశాల సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని, ఆస్పత్రిలో 30 పడకలే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 50 పడకలకు మంజూరు చేసినా భవనానికి నిధులు కేటాయించాలని చెప్పినప్పటికీ నేటికి పట్టించుకోవడం లేదని అన్నారు. అదేవిధంగా టీ హబ్‌లో పరికరాలు లేవని, బ్లడ్ బ్యాంక్ ఉన్నా ప్లేట్ లెట్స్‌కి లైసెన్స్ లేకపోవడంతో ప్లేటలెట్స్ కోసం వేరే ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా మార్చి 100 పడకలకు పెంచి మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లను, స్టాఫ్‌నర్స్‌లను, సిబ్బంది పెంచాలని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్, నాయకులు అరుణ్, లాజర్, కృష్ణబాబు, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

కోతుల సమస్య పరిష్కరించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట : మండలంలో కోతులబారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పస్రా చౌరస్తాలో ఆ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కోతుల సమస్యను పరిష్కరించాలని ప్లకార్డులతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి ఇల్లు కోతుల సమస్యతో బాధ పడుతోందని, ఇప్పటికి చాలా మంది కోతుల దాడుల్లో గాయాలపాలయ్యారని అన్నారు. చిన్నారులకు రక్షణ లేదని, పిల్లలు, వృద్ధులపై గుంపులు గుంపులుగా మీద పడి దాడులు చేస్తున్నాయని అన్నారు. రైతుల పంట పొలాలు నాశనం చేస్తున్నాయని, చిరు వ్యాపారులను తీవ్రంగా నష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కోతుల నివారణ చేపట్టాలని కోరారు. లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ములుగు రూరల్ : మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న వంట కార్మికులతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మధ్యాహ్న వంట చేసే నిర్వాహకులకు రూ.10 వేల వేతనం అందిస్తామని, కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా నిత్యావసర ధరలను పెంచి చెల్లించాలని కోరారు. విద్యార్థులకు రాగి జావ అందిచడానికి రూ.2 చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సంఘం నాయకులు రాజకుమారి, ప్రమీల, భారతి, రాధక్క, సమ్మక్క, భవాణి, షపియ, సుమతి, సుజాత, రజిత, కల్పన, మల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

ప్రగళ్లపల్లిలో వైద్యశిబిరం



వాజేడు: వైద్యశిబిరంలో పాల్గొన్న వారితో డాక్టర్ మహేందర్



వాజేడు: చంద్రుపట్లలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ యోషిత

వాజేడు : మండల పరిధిలోని ప్రగళ్లపల్లి పల్లెదవాఖానాలో బుధవారం వాజేడు వైద్యాధికారి మహేందర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 22 మందికి తెమడ పరీక్షలను నిర్వహించారు. క్షయ వ్యాధికి సంబంధించిన అనుమానాలు ఉండటంతో నిర్ధారణకు వారి నుంచి తెమడను సేకరించి పరీక్షల నిమిత్తం ములుగు జిల్లా ఆస్పత్రికి పంపించారు. అనంతరం పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి యోషిత రోగులను పరీక్షించి మందులను అందించారు. ఎలాంటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యశాలకు రావాలని ఆమె కోరారు. వారి వెంట వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో..



ములుగు రూరల్: జంగాలపల్లిలో..



ఏటూరునాగారం: రామాలయంలో అన్నదానం..



మంగపేట: కోమటిపల్లి క్రాస్ వద్ద వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వెంకటాపురం(ఎం): కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ములుగు రూరల్ : యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో మిత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జంగాలపల్లి క్రాస్ రోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కూనూరు అశోక్‌గౌడ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ములుగు డీఎస్పీ రవీందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని గుడియమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బుధవారం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో కూరెళ్ల రజిత, పంబిడి విజయ, రమాదేవి, లావణ్య, సునీత, రాణి, హాసిని, రజిత, లక్ష్మి, అంజలి, స్వరూప, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : మండల కేంద్రంలోని సిద్ధి వినాయక మండపం వద్ద మంగళవారం రాత్రి కుంకుమపూజ నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని నాగారం, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం వినాయక కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని రామాలయంలో గణపతి ఉత్సవాల సందర్భంగా బుధవారం అన్నదానం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. బస్టాండ్ వద్ద సేవా యూత్ సభ్యులు అన్నదానం చేశారు.

కన్నాయిగూడెం : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద వినాయక కమిటీ నిర్వాహకులు, యువకులు, రాజకీయ నాయకులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. బుధవారం మండలంలోని బుట్టాయిగూడెంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మంగపేట : మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మంగపేట, కొత్తమల్లూరు(బెస్తగూడెం), నర్సింహాసాగర్, కమలాపురం, రాజుపేట తదితర గ్రామాల్లో నిర్వాహకులు దాతల సాయంతో అన్నదానం నిర్వహించారు.



వాజేడు: కుంకుమ పూజ నిర్వహిస్తున్న భక్తులు



మంగపేట: భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బాలుర హాస్టల్ మంజూరు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

గోవిందరావుపేట : మండల కేంద్రంలో ఎస్టీ ఎస్ఎంహెచ్ (బాలుర) మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నార్లాపూర్, కొడిశాల ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చదువుకోవడానికి వస్తున్నారని తెలిపారు. బాయ్స్ కళాశాల హాస్టల్ లేక విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు కళాశాల హాస్టల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి, కాలేజీ కమిటీ నాయకులు చరణ్, మహేశ్వర్, రోహిత్, మానస, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న క్రాంతి కుమార్

వెంకటాపురం(కె) : విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతి కుమార్ అన్నారు. మండలంలోని ఎదిర వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వేలో రోజుకు 20 ఇళ్లను సందర్శించాలన్నారు. జ్వరం వచ్చిన వ్యక్తుల నుంచి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. గ్రామాల్లోని మురుగు నీటి గుంతల్లో టీమోఫాస్ మందును చల్లాలని వివరించారు. హెచ్ఈఓ కోటిరెడ్డి, ఆదిలక్ష్మి, సూర్యకుమారి, రోజారాణి, సుశీల తదితరులు ఉన్నారు.